క్లుప్తంగా

జ్ఞాపకాలకు సజీవ సాక్ష్యం ఫొటో



రాజోళి: జ్ఞాపకాలను మన ముందు ఉంచి, సంతోషాన్ని తీసుకొచ్చేదే ఫొటో అని ఫొటోగ్రాఫర్ల మండల అధ్యక్షుడు కాకే సుధాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం రాజోళిలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రాఫర్లు ర్యాలీ నిర్వహించారు. ఫొటోగ్రాఫర్లు సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల క్యాలెండర్లు, బుక్‌లెట్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రఘు, శ్రీకాంత్, కిరణ్, ఆడివి స్వామి, రాజు, వీరేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం కప్ప పూజలు

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో వర్షాలు సమృద్ధిగా పడాలంటూ గ్రామస్తులు కప్ప పూజలు ఆదివారం నిర్వహించారు. కప్పను తీసుకొని ఇంటింటికి తిరుతూ వర్షాలు పడాలంటూ పూజ చేశారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు



కేటీదొడ్డి: మండల పరిధిలోని నందిన్నె గ్రామంలో శ్రీగురుశంభులింగేశ్వర మఠంలో జ్యోతిర్లింగ ఆలయ నిర్మాణం సందర్భంగా 12 జ్యోతిర్లింగాలు, బసవన్న, గణపతి, నవగ్రహాలకు ఆదివారం సవారమ్మ ఆలయం నుంచి మఠం వద్దకు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపులో మహిళలు, గ్రామస్తులు పెద్దలు పాల్గొని విజయవంతం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆకతాయిల దుశ్చర్య



ఉండవెల్లి: మండలంలోని ఉండవెల్లి నుంచి కంచుపాడు వెళ్లే మార్గంలో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. రోడ్డు మార్గంలోని భారీ వృక్షం మొదలులో యాసిడ్ పోయడంతో చెట్టు రోడ్డుకు అడ్డుగా నేలకొరిగింది. రైతులు, వాహనదారులకు నీడనిచ్చే చెట్టు నేలకొరగడం పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రక్షణ కంచె ఏర్పాటు చేయండి సారూ..



ఇటిక్యాల: మండల పరిధిలోని చాగాపురం గ్రామంలో ఇళ్ల మధ్యన ఉన్న రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నట్లు వాపోతున్నారు. విద్యార్థులు నిత్యం పాఠశాలలకు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారని ప్రమాదం జరుగక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

గద్వాల క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మంది వాహనదారులపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో కృష్ణవేణి చౌక్‌లో పట్టణ, ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్‌ఐ బాలచంద్రుడు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గద్వాల క్రైం: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పలు లాడ్జ్‌ల్లో సోదాలు నిర్వహించిన క్రమంలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద రూ.5100 నగదు స్వాధీనం చేసి గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- సీసీరోడ్డు కింద కొట్టుకుపోతున్న మట్టి
- శిథిలావస్థలో డ్రైనేజీ
- భారీ వాహనాలు వెళ్తే ప్రమాదం



ప్రమాదకర స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్



ప్రమాదం పొంచి ఉన్న సీసీరోడ్డు

అయిజ: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి తూంకుంట రోడ్డు వరకు 2000 సంవత్సరంలో నిర్మించిన సీసీ రోడ్డుకు కమతంపేటలోని రెడ్డి కమ్యూనిటీ హాల్ వద్ద శిథిలావస్థకు చేరుకుంది. అదే ప్రదేశంలో డ్రైనేజీ రాళ్లు ఊడిపడుతున్నాయి. ఇటీవల కాలంలో వర్షం కురిసిన ప్రతిసారి వర్షపునీరు మురుగు కాలువలో ప్రవాహంలా వస్తుంది. నీటి తాకిడి ఎక్కువ వచ్చిన ప్రతిసారి సీసీ రోడ్డు కింద ఉన్న మట్టి కరిగిపోయి రోజురోజుకు ఖాళీ ప్రదేశం ఏర్పడుతుంది. దీంతో రోడ్డు కుంగే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.

నిత్యం వందల సంఖ్యలో వాహనాలు

గద్వాల రోడ్డు నుంచి ఇటు కర్నూలు రోడ్డుకు, అటు తూంకుంట రోడ్డుకు వెళ్లేందుకు నిర్మించిన బైపాస్ రోడ్డుపై మోటార్ సైకిళ్లతోపాటు ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, స్కూల్ బస్సులు సిమెంట్ లారీలు, టిప్పర్లు వెళ్తుంటాయి. భారీ వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు కుంగి ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ప్రమాదం జరుగక ముందే శిథిలమైన అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



సీసీరోడ్డు కింద మట్టి వర్షాల ధాటికి కొట్టుకుపోతుంది. భారీ వాహనాలు వెళ్తే రోడ్డు కుంగే ప్రమాదం ఉంది. రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ప్రమాదం జరిగితే ప్రజల ప్రాణాలు పోతాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– జగన్నాథరెడ్డి, అయిజ

మరమ్మతు చేపడుతాం



సమస్య ఉన్న స్థలాన్ని పరిశీలించాం. మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ సిబ్బంది సూచించారు. మున్సిపల్ ఏఈ లేకపోవడంతో మరమ్మతు పనులు చేపట్టలేక పోయాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

– సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్

‘స్థానిక’ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

అయిజ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పురంలో బీజేపీ ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో సీసీరోడ్లు, పల్లె ప్రకృతి వనం, స్వచ్ఛభారత్ నిర్వహణ, రైతువేదికల నిర్మాణం, ఉచితంగా సన్న బియ్యం పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, గోపాలకృష్ణ, భగత్‌రెడ్డి, రంజిత్, లక్ష్మణ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకోవడం సరికాదు



అయిజ: రెవెన్యూ అధికారులు మాదాసి కుర్వ, మాదారి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకోవడం సరికాదని కుర్వ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిక్కయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మాదాసి కుర్వ, మాదాసి మాదారి కుర్వ జిల్లా నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయిజ మండల కన్వీనర్‌గా ఉప్పల క్యాంపు గ్రామానికి చెందిన కేపీ రాజేష్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డుతో అవస్థలు

మానవపాడు: మండల కేంద్రం నుంచి చెన్నిపాడుకు వెళ్లే రహదారిలో కల్వర్టుపై రోడ్డు కోతకు గురై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల ధాటికి రోడ్డు పూర్తిగా కోతకు గురవుతుందన్నారు. పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుపై వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మానవపాడు- చెన్నిపాడు మార్గంలో కల్వర్టుపై కోతకు గురైన రోడ్డు

మీడియా కార్యాలయంపై దాడి అమానుషం

అయిజ: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు, వారి కార్యాలయాలకు భద్రత లేకుండా పోతుందని, మహా న్యూస్ మీడియా కార్యాలయంపై దాడులు చేయడం అమానుషమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనం

మల్దకల్: మండలంలోని బిజ్వారం గ్రామంలో బీసీ కమ్యూనిటీ భవనం నిరుపయోగంగా ఉంది. 17ఏళ్ల క్రితం రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ భవనం బీసీ కాలనీకి దూరంగా ఉండటంతో వినియోగానికి నోచుకోకుంది. దీంతో కమ్యూనిటీ భవనం యాచకులు, మద్యంబాబులకు ఆవాసంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించినా కమ్యూనిటీ భవనం శిథిలావస్థకు చేరుకుందని అధికారులు చర్యలు తీసుకొని వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ముళ్లచెట్లు మధ్యలో కమ్యూనిటీ భవనం

సందర్శకులతో జూరాల కిటకిట



ప్రాజెక్ట్ రోడ్డుపై బారులు తీరిన వాహనాలు

- పెద్దఎత్తున తరలి వస్తున్న సందర్శకులు
- ప్రాజెక్టు రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్

ధరూరు: ఎగువన కురిసిన భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. గత రెండు వారాలుగా వస్తున్న వరదతో ప్రాజెక్టుకు కొత్త కళ సంతరించుకుంది. గేట్లను ఎత్తడంతో సందర్శకులు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. కృష్ణమ్మ అందాలను తిలకించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ఉదయం నుంచి సందర్శకులతో జూరాల ప్రాజెక్టు కిటకిటలాడింది. ప్రాజెక్టు వద్ద గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు రోడ్డుపై కిలో మీటర్ పొడవునా వాహనాలు నిలిచి ట్రాఫిక్ జాం అవుతున్నా పట్టించుకోలేదని సందర్శకులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రాజెక్టుపై సందడి చేస్తున్న సందర్శకులు



క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరదను తిలకిస్తున్న పర్యాటకులు

పాత పాసుబుక్కులే గతి



ఉండవెల్లి తహసీల్దార్ కార్యాలయం

- పథకాలు అందడం లేదంటున్న రైతులు
- సర్వే చేయాలని వినతుల వెల్లువ

ఉండవెల్లి: నూతన పట్టాదారు పాసు బుక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి నూతన పట్టాదారు పాసుబుక్కులు కోసం పడిగాపులు కాస్తున్నట్లు వాపోతున్నారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఫలితం లేకుండా పోతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

15 ఎకరాల్లో 20 మందికి భూమి

మండలంలోని కంచుపాడు శివారులో సర్వే నంబర్ 90లో 15.31 ఎకరాల్లో 20 మంది రైతులకు భూమి ఉంది. వారికి 2014లో మంజూరు చేసిన పాత పాసుబుక్కులు ఉన్నా.. నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన పాసుబుక్కులు లేక రైతుబంధు, పీఎం కిసాన్ పథకాలు రావడం లేదని వాపోతున్నారు. అదే విధంగా అధికారులకు మొరపెట్టుకుంటున్న ఏళ్ల తరబడిగా ఎదురుచూపులేనని కంచుపాడు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరణి, భూభారతి వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్న నూతన పాసు బుక్కులు రావడం లేదంటు వాపోతున్నారు. జిల్లా సర్వేయర్ వచ్చి సర్వే చేసిన ఎలాంటి ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన పాసుబుక్కులు అందజేసి పథకాలు వర్తింప చేయాలని రైతులు కోరుతున్నారు.

సర్వేయర్ రావడం లేదు.

వ్యవసాయ పొలాన్ని సర్వే చేసి కొత్త పుస్తకాలను ఇవ్వాలని అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోతుంది. సర్వేయర్ ఎప్పుడు వస్తాడో ఎప్పుడు వెళ్తాడో తెలియని తెలియని పరిస్థితి నెలకొంది. ప్రైవేటు వెంచర్లను సర్వే చేయడానికి అధికారులు మొగ్గు చూపుతున్నారు.

–నరసింహులు, తక్కశీల, రైతు

పథకాలు అందేలా చూడండి

మాకు సర్వే నంబర్ 90లో 35 కుంటల భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటే బతకాలి లేదంటే లేదు. ప్రభుత్వ పథకాలు మాకు అందడం లేదు. అధికారుల చుట్టు తిరిగి తిరిగి కాళ్లు అరిగిపోయాయి. నూతన పాస్ బుక్కులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

–పద్మమ్మ, రైతు, కంచుపాడు

భూమి ఎక్కువగా ఉంది

కంచుపాడులో శివారులోని సర్వే నంబర్ 90లో 15 ఎకరాల 31 కుంటలు భూమి ఉంది. అందులో 3 ఎకరాల భూమి ఎక్కువగా ఉంది. ఇప్పటికే ఈ విషయాన్ని రైతులకు తెలియజేశాం. ఏ ఒక్క రైతుకు ఎక్కువ భూమి వచ్చినా ఇబ్బందులు తలెత్తుతాయి.

–ప్రభాకర్, తహసీల్దార్, ఉండవెల్లి

ప్రజల సంక్షేమానికి శ్రమించే నాయకులు



సీఎం రేవంత్, సంపత్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజోళి: నిత్యం ప్రజల సంక్షేమం కోసం శ్రమించే నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పెద్దింటి నాగేష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు పేదలకు అర్హులకు సకాలంలో ఇవ్వడమే కాకుండా, భూ భారతి ద్వారా రైతులకు భూముల్లో ఉన్న ఇబ్బందులను తొలగించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందంటే మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమారే కారణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తప్పని తంటాలు

ఇటిక్యాల: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటిని సరఫరా చేసేవారని కొంత కాలంగా నీరు సక్రమంగా సరఫరా చేయడం లేదని వాపోతున్నారు. మిషన్ భగీరథ పథక నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేతిపంపులు, వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి నీటికోసం అష్టకష్టాలు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



తాగునీటి కోసం పడిగాపులు కాస్తున్న ప్రజలు

పంచ సూత్రాలతో సంఘాలు బలోపేతం

గట్టు: గ్రామ సంఘాలు పంచసూత్రాలను పాటించడం ద్వారా మరింత బలంగా తయారవుతాయని రిసోర్స్ పర్సన్లు భాగ్యలక్ష్మి, కుసుమ కుమారి అన్నారు. మహిళల సంఘాలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు మాట్లాడుతూ.. గ్రామ సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. క్రమం తప్పకుండా పొదుపు కట్టడం, అంతర్గత అప్పులు ఇవ్వడం, సంఘాల పుస్తకాలు రాయడం వంటి వాటిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు వెంకటేశ్వరి, అశ్విని, సీసీలు ఆంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహిళల సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీలు

త్రైత సిద్ధాంత గ్రంథాల పంపిణీ

గట్టు: మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక బింగిదొడ్డి కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జూలై 10 గురుపౌర్ణమిని పురస్కరించుకొని భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం తెలియజేస్తుందన్నారు. శ్రీకృష్ణుడుని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపౌర్ణమి పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రంగప్ప, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, నర్సింహ పాల్గొన్నారు.



గ్రంథాలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

సీడ్ పత్తి పంట తొలగింపు

మల్దకల్: సీడ్‌పత్తి పంట పెట్టుబడులకు ఆర్గనైజర్లు డబ్బులు ఇవ్వడం లేదనే కారణంతో రైతులు సాగు చేసిన పత్తిపంటను తొలగిస్తున్నారు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని విఠలాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తెలుగు చెన్నయ్య, బుచ్చప్ప తమకున్న రెండు ఎకరాల వ్యవసాయ పొలంలో రూ.లక్షకు పైగా పెట్టుబడితో రెండు ఎకరాలలో సీడ్‌పత్తి పంటను సాగుచేశారు. ప్రతి ఏటా సాగుకు ఆర్గనైజర్లు ఇచ్చే డబ్బులతో పంటకు కావాల్సిన పెట్టుబడి పెట్టి సీడ్‌పత్తి పంటను సాగు చేసేవారు. పంట దిగుబడుల అనంతరం వచ్చిన పంటను ఆర్గనైజర్ల సహాయంతో కంపెనీకి అమ్మడం జరుగుతుందని, అలా వచ్చిన డబ్బులో ఆర్గనైజర్లకు పోను మిగిలిన డబ్బును తమకు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కంపెనీ నిర్వాహకులు రైతులకు పెట్టుబడులు ఇవ్వమని ససేమిరా చెప్పడంతో ఏంచేయాలో తోచక ఆర్గనైజర్లు, సబ్‌ఆర్గనైజర్లు రైతులకు పంట పెట్టుబడికి తాము డబ్బులు ఇవ్వలేమని తేల్చిచెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో కొంతమంది రైతులు తమ సొంత పెట్టుబడులతో సీడ్ పత్తి పంటను సాగుచేయలేక ఉన్న పత్తి చేనును తొలగించుకుంటున్న పరిస్థితి నెలకొంది. రూ.వేలు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ యజమానులు ఇచ్చిన విత్తనాలతో పంట సాగుచేసిన నెలరోజుల తర్వాత పెట్టుబడి సాయం ఇవ్వలేమనే ఆర్గనైజర్ల మాటతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. చేసిన అప్పులను తీర్చలేక.. ఉన్న పంటను తొలగించి వేరే పంటలు సాగుచేసుకోలేక ఏంచేయాలో తోచని అయోమయ స్థితిలో రైతులు పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.



విఠలాపురంలో సీడ్ పత్తి పంట తొలగిస్తున్న రైతు తెలుగు చెన్నయ్య